సాక్షి నిజామాబాద్


శుక్రవారం । 28 । మార్చి । 2025



గ్రామానికో పాలన అధికారి

గ్రామస్థాయిలో రెవెన్యూ శాఖ బలోపేతం దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. గ్రామ పాలనాధికారిని అందుబాటులోకి తేనుంది.

- IIలో ▸



వాతావరణం

గరిష్టం/కనిష్టం
39.0 /20.2

ఉదయం ఆహ్లాదకరంగా ఉంటుంది. పగటి ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశాలున్నాయి. రాత్రి ఉక్కపోతగా ఉంటుంది.



సాక్షి కవితలకు ఆహ్వానం..

తెలుగు ప్రజల నూతన సంవత్సరాది ఉగాది. ఈ పండగకు చాలా ప్రాముఖ్యత ఉంది. ఉగాది ప్రాశస్త్యాన్ని వివరిస్తూ 'సాక్షి' కవితలను ఆహ్వానిస్తోంది. 10 లైన్లకు మించకుండా మీ కవితను పంపండి. మీ ఫొటోను జత చేయండి. ఎంపిక చేసిన కవితలను ఉగాది రోజున ప్రచురిస్తాం..

పంపించాల్సిన వాట్సాప్ నంబర్ :
998 9709 595

న్యూస్‌రీల్

సర్వర్ డౌన్

- నిలిచిన జనన, మరణ ధ్రువీకరణలు



నిజామాబాద్ సిటీ : నగరపాలక సంస్థ కార్యాలయంలో రెండు రోజులుగా సర్వర్ నిలిచిపోయింది. బుధ, గురువారాల్లో జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు జారీ చేసే విభాగంలో పోర్టల్ పనిచేయలేదు. పోర్టల్ అప్‌గ్రేడ్ చేస్తుండడంతోనే రాష్ట్ర వ్యాప్తంగా సేవలు నిలిచిపోయినట్లు తెలిసింది. సర్టిఫికెట్ల కోసం కార్పొరేషన్ కార్యాలయానికి వస్తున్న ప్రజలు నిరాశగా వెనుదిరుగుతున్నారు.

డిగ్రీ పరీక్ష ఫీజు చెల్లింపు గడువు పొడిగింపు

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలోని 2020–24 బ్యాచ్ డిగ్రీ రెగ్యులర్, బ్యాక్‌లాగ్ పరీక్ష ఫీజు చెల్లింపు గడువును విద్యార్థుల వినతి మేరకు ఏప్రిల్ 7వరకు పొడిగించినట్లు కంట్రోలర్ సంపత్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. బీఏ, బీకాం, బీఎస్సీ, బీబీఏ కోర్సులకు సంబంధించి 2, 4, 6వ సెమిస్టర్ రెగ్యులర్, 1, 3, 5వ సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షలకు (ఏప్రిల్, మే 2025లో) హాజరయ్యే విద్యార్థులకు ఈ షెడ్యూల్ వర్తిస్తుందన్నారు. రూ.100 అపరాధ రుసుముతో ఏప్రిల్ 8వరకు పరీక్ష ఫీజు చెల్లించే అవకాశం ఉంటుందన్నారు. పూర్తి వివరాలకు తెలంగాణ యూనివర్సిటీ వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

గుదిబండగా ప్రభుత్వ కార్యాలయాలు

- బల్దియాకు రూ. 36 కోట్ల మేర బకాయిలు
- రూ. 23 కోట్లు బకాయిపడ్డ ఆరోగ్యశాఖ

నిజామాబాద్ సిటీ : నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ప్రభుత్వ కార్యాలయాలు బల్దియాకు గుదిబండగా మారాయి. ఆస్తిపన్ను చెల్లించాలని నగరవాసులపై ఒత్తిడితెచ్చే అధికారులు సర్కారు భవనాలపై పెద్దగా దృష్టి సారించడం లేదు. గత కొన్నేళ్లుగా బల్దియాకు ప్రభుత్వ కార్యాలయాలు బకాయిపడ్డాయి. ఆస్తిపన్ను చెల్లించడం లేదు. దాంతో పన్నులు పెరిగిపోయాయి. జిల్లా కేంద్రంలోని 21 ప్రభుత్వ కార్యాలయాలకు సంబంధించిన మొత్తం బకాయిలు రూ. 36 కోట్ల 30 లక్షల 33 వేలు చెల్లించాల్సి ఉంది. వాటిలో అత్యధికంగా ఆరోగ్యశాఖ రూ. 23 కోట్ల 34 లక్షల 88 వేల 90 బకాయిలు పేరుకుపోయాయి. ఇందులో కొన్ని శాఖల నుంచి కొంత మేర బకాయిలు వసూలు చేశారు. వాటిలో పోలీసు, విద్యుత్ శాఖ, కలెక్టరేట్, హౌసింగ్ శాఖలకు సంబంధించిన కొంతమేర బకాయిలు చెల్లించడంతో బల్దియాకు కాస్త ఊరట కలిగింది.

- బకాయిల వివరాలు IIలో ▸

మన బహుళ అంతస్తులు భద్రమేనా..?



షైరింజన్ తిరగడానికి వీలులేకుండా నగరంలోని ఖలీల్‌వాడిలో నిర్మించిన బహుళ అంతస్తుల భవనాలు

భద్రాచలంలో అనుమతి లేకుండా నిర్మిస్తున్న బహుళ అంతస్తుల భవనం కుప్పకూలిన నేపథ్యంలో నగరంలోని భవనాల భద్రతపై ప్రజల్లో సందేహాలు మొదలయ్యాయి. ప్రజాప్రతినిధులు, అధికారుల అండ ఉందంటూ పలువురు యథేచ్ఛగా నిబంధనలు అతిక్రమించి భవనాలు నిర్మిస్తుండడం విశేషం. చర్యలు తీసుకోవాల్సిన అధికార యంత్రాంగమే చేష్టలుడిగి చూస్తుండడంతో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

- భద్రాచలం ఘటనతో పాఠం నేర్చుకునేనా?
- నగరంలోని బిల్డింగ్‌ల భద్రతపై చర్చ
- నిబంధనలు అతిక్రమించిన నిర్మాణాలే అధికం
- నగరపాలక అధికారుల దన్నుతోనే నిర్మించారనేది బహిరంగ రహస్యం

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : నిజామాబాద్ నగరంలో నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన భవనాలు అనేకం ఉన్నాయి. సెల్లార్ అనుమతులు లేకుండా, ఫైర్ ఇంజిన్ తిరిగే అవకాశం లేకుండా, సెట్‌బ్యాక్ లేకుండా, రెండుమూడు ఫ్లోర్లకు మాత్రమే అనుమతులు తీసుకొని ఐదారు అంతస్తుల భవనాలను నిర్మించారు. వీటన్నింటి విషయాలు సంబంధిత నగరపాలక టౌన్‌ప్లానింగ్ అధికారులకు తెలియనిది కాదు. కొత్తగా నిర్మాణంలో ఉన్న చాలా భవనాలు సైతం నిబంధనలు అతిక్రమించినవే. తాజాగా భద్రాచలం పట్టణంలో చోటుచేసుకున్న ఘటన నిజామాబాద్‌లో నిర్మాణంలో ఉన్న భవనాల విషయమై అనేక ప్రశ్నలు, అనుమానాలకు మరింతగా తావిస్తోంది. టౌన్‌ప్లానింగ్ అధికారులే అక్రమాలకు మార్గాలు సూచించడం, విచారణకు బదులు సెటిల్‌మెంట్లు చేస్తుండడంపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి.

■ నగరంలోని బొంబాయి నర్సింగ్ హోమ్ సమీపంలో పాత అరోమా బిల్డింగ్ ముందున్న రోడ్డు 120 అడుగులు ఉండాలి. దీంతో ఆ బిల్డింగ్ వాళ్లు నగరపాలక రోడ్డు కోసం గిఫ్ట్ కింద 18 అడుగుల పొడవుతో 134 గజాలు నగరపాలక సంస్థకు గిఫ్ట్ రిజిస్ట్రేషన్ చేసిచ్చారు. ఉత్తరం వైపు ఐదు అడుగుల రోడ్డు ఎఫెక్ట్ ఏరియా చూపించారు. కానీ, ఏ మాత్రం రోడ్డు ఎఫెక్ట్ ఏరియాను వదిలేయకుండా నిర్మిస్తున్నారు. స్టిల్ ప్లేస్, అప్పర్ ఫ్లోర్స్ అనుమతులు తీసుకొని, సెల్లార్ అనుమతులు లేకుండానే కట్టారు. దీనిపై ఫిర్యాదులు రావడంతో నగరపాలక సంస్థ నుంచి 08.10.2024న బిల్డింగ్ ఓనర్లకు నోటీసులిచ్చారు. కానీ, ఇప్పటి వరకు ఏమాత్రం చర్యలు తీసుకోలేదు. మున్సిపల్ టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్ అండదండలతో యథేచ్ఛగా పనులు కొనసాగుతున్నాయి. కలెక్టర్, మున్సిపల్ కమిషనర్ పరిశీలించి అక్రమ నిర్మాణాలను తొలగించాలని స్థానిక ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.



నగరంలో జీప్లస్ టూ అనుమతితో నిర్మిస్తున్న జీప్లస్ సిక్స్ భవనం

■ పులాంగ్ చౌరస్తా నుంచి ఆర్‌ఆర్ చౌరస్తా వెళ్లే రోడ్డు మాస్టర్ ప్లాన్‌లో భాగంగా 120 అడుగులు. చైతన్య పబ్లిక్ స్కూల్ దాటిన తర్వాత మెయిన్ రోడ్‌లో సెల్లార్ అనుమతులు లేకుండా జీప్లస్ టూ అనుమతితో జీప్లస్ సిక్స్ భవనం నిర్మిస్తున్నారు. మున్సిపల్ రోడ్డుకు ఇచ్చిన గిఫ్ట్ ఏరియా, సెట్ బ్యాక్ వదలకుండానే నిర్మాణం చేస్తున్నారు. అదే లైన్‌లో ట్రిపుల్ ఎస్ బార్ దాటిన తర్వాత రోడ్డుకు గిఫ్ట్ స్థలం వదలకుండా, ఏమాత్రం సెట్ బ్యాక్ వదలకుండా, తీసుకున్న అనుమతుల కంటే ఎక్కువ ఫ్లోర్లు కడుతున్నారు. దీనిపై ఫిర్యాదు వచ్చింది. అయితే, భవనం నిర్మిస్తున్న వ్యక్తి తనకు ఎంపీ, ఎమ్మెల్యే అండదండలు ఉన్నాయని చెబుతుండడం విశేషం.

■ శ్రద్ధానంద్‌గంజ్ ఏరియాలో ప్రభాత్ టాకీస్ వద్ద నిబంధనల ప్రకారం రోడ్డు నుంచి 30 అడుగుల జాగా వదలాల్సి ఉండగా 25 అడుగులు మాత్రమే వదిలినప్పటికీ డిస్ట్రిక్ట్ సిటీ ప్లానర్ అనుమతి ఇవ్వడం గమనార్హం. ఇక్కడ అధికారులే జీవో 168ని ఉల్లంఘించడం గమనార్హం.

■ డీసీపీగా వికాస్ ఉన్న సమయంలో ఓ వ్యక్తి ఎల్‌ఆర్‌ఎస్ కోసం దరఖాస్తు చేసేందుకు ఓ లైసెన్స్‌డ్ ఇంజినీర్‌ను సంప్రదించాడు. అయితే సదరు ఇంజినీర్ టౌన్ ప్లానింగ్ ఉద్యోగుల సహకారంతో నకిలీ ఎల్‌ఆర్‌ఎస్ సృష్టించాడు. తర్వాత ఈ విషయమై సదరు ప్లాట్ ఓనర్‌ను కొందరు ఉద్యోగులు బ్లాక్‌మెయిల్ చేశారు. అది నకిలీ ఎల్‌ఆర్‌ఎస్ ధ్రువీకరణ అని ప్లాట్ ఓనర్‌కు తెలియదు. దీనిపై అతనికి టౌన్‌ప్లానింగ్ అధికారులు నోటీసులు పంపారు. దీంతో సదరు వ్యక్తి లైసెన్స్‌డ్ ఇంజినీర్ వద్దకు వెళ్లి నోటీసులు చూపించాడు. ఈ నోటీసుకు సంబంధించి సదరు వ్యక్తి సంతకాన్ని ఫోర్జరీ చేసిన ఇంజినీరు రిప్లై పంపాడు. తర్వాత ఫీజు కట్టాల్సిందేనని టౌన్ ప్లానింగ్ నుంచి మరో నోటీసు సదరు వ్యక్తికి పంపారు. ఈ అంశంలో నకిలీ ఎల్‌ఆర్‌ఎస్ సృష్టించిన లైసెన్స్‌డ్ ఇంజినీర్‌పై చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్‌కు సదరు వ్యక్తి ఫిర్యాదు చేసినప్పటికీ పట్టించుకోలేదు. దీంతో బాధితుడు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాడు. కలెక్టర్ విచారణకు ఆదేశించగా, విచారణ చేయాల్సిన టౌన్ ప్లానింగ్ అధికారి చేయలేదు. పైగా నకిలీ ఎల్‌ఆర్‌ఎస్ తయారు చేసిన ఇంజినీర్‌ను కాపాడేందుకు టౌన్‌ప్లానింగ్ అధికారి ప్లాట్ ఓనర్‌ను బెదిరించి ఫీజు కట్టించారు. ఫిర్యాదును విత్‌డ్రా చేసుకోవాలని బ్లాక్‌మెయిల్ చేయడం గమనార్హం. ఈ అంశంలో కలెక్టర్‌ను సైతం టౌన్‌ప్లానింగ్ అధికారులు మోసం చేయడం విశేషం. ఇలాంటి నగరపాలక యంత్రాంగం.. భద్రాచలం పట్టణంలో చోటుచేసుకున్న ఘటనల నుంచి ఒక్క శాతం కూడా పాఠాలు నేర్చుకోరని నగర ప్రజలు అంటున్నారు.

■ గాయత్రినగర్ ఏరియాలో 773, 774, 775, 787, 790, 791 సర్వే నంబర్లలో ఓ వ్యక్తి వెంచర్ వేసి చాలావరకు ప్లాట్లను అమ్మేశాడు. కాగా ఇందులో ఒక ప్లాట్‌లో నిర్మాణానికి సంబంధించి సదరు వెంచర్ వేసిన వ్యక్తి పేరిట బిల్డర్ టీఎస్‌బీపాస్ ద్వారా దరఖాస్తు చేశాడు. దీని విషయమై గతంలోనే టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్ సైట్ ఇన్‌స్పెక్షన్ సైతం చేశాడు. డిస్ట్రిక్ట్ సిటీ ప్లానర్ అప్రూవల్ ఇచ్చారు. విచిత్రమేమిటంటే అదే దరఖాస్తుపై మరొక వ్యక్తి పేరుమీద అనుమతులు ఇచ్చారు.

స్వశక్తి సంఘాల మహిళలకు బీమా

- లోన్, యాక్సిడెంటల్ ఇన్సూరెన్స్ వర్తింపు
- కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు

నిజామాబాద్ అర్బన్ : రాష్ట్రంలోని మహిళా స్వశక్తి సంఘాల సభ్యులకు రాష్ట్ర ప్రభుత్వం రుణ, ప్రమాద బీమా సౌకర్యాన్ని వర్తింపజేస్తోందని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు వెల్లడించారు. సెర్ప్ సీఈవో దివ్య దేవరాజన్‌తో కలిసి పంచాయతీ రాజ్ శాఖ కార్యదర్శి లోకేశ్ కుమార్ కలెక్టర్లతో గురువారం వీసీ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా బీమా పథకాలపై వివరించారు. అనంతరం సంబంధిత జిల్లా అధికారులతో కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు మాట్లాడుతూ బీమా సదుపాయం వివరాలను స్వయం సహాయక సంఘాల సభ్యులందరికీ తెలపాలన్నారు. చనిపోయిన సభ్యుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసేలా చర్యలు తీసుకోవాలని సెర్ప్, మెప్మా అధికారులను కలెక్టర్ ఆదేశించారు. రుణ బీమాలో భాగంగా స్వయం సహాయక సంఘం సభ్యులుగా ఉండి (18 – 60 సంవత్సరాలు) బ్యాంకు లోన్ తీసుకొని సహజ మరణం పొందితే .. ఆమె చెల్లించాల్సిన అప్పు నిల్వ మొత్తం రూ. 2లక్షలకు మించకుండా ప్రభుత్వమే బ్యాంకుకు చెల్లిస్తుందన్నారు. ప్రమాదవశాత్తు మరణిస్తే లోన్ బీమా కింద రూ.10 లక్షల ఇన్సూరెన్స్ మొత్తాన్ని కుటుంబసభ్యులకు అందజేయనున్నట్లు తెలిపారు. ప్రమాదంలో శాశ్వత వైకల్యానికి గురైతే రూ.10 లక్షలు, 50 శాతం వైకల్యం సంభవిస్తే రూ.5 లక్షల ఇన్సూరెన్సు చెల్లిస్తామన్నారు.

రెండు బీమా సౌకర్యాలు 2024 మార్చి 14 వ తేదీ నుంచి అమలులోకి వచ్చాయని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో ఇటీవలి కాలంలో మరణించిన స్వయం సహాయక సంఘాల సభ్యుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసి, క్లెయిమ్ డాక్యుమెంట్స్‌ను అప్‌లోడ్ చేయాలన్నారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రయోజనం చేకూరేలా కృషి చేయాలని డీఆర్డీవో సాయాగౌడ్, మెప్మా పీడీ రాజేందర్‌కు సూచించారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, ఇతర అధికారులు

సన్నబియ్యం పంపిణీకి సిద్ధం

- వచ్చే నెల 1 నుంచి లబ్ధిదారులకు అందజేత
- 7,540 మెట్రిక్ టన్నులు అవసరమని అంచనా
- రేషన్ దుకాణాలకు చేరిన సన్నబియ్యం

జిల్లాలో మండలాలు	రేషన్ దుకాణాలు	కార్డుల సంఖ్య	ప్రతినెలా అవసరమైన బియ్యం (మెట్రిక్ టన్నులు)
33	759	403215	7540

సుభాష్‌నగర్: జిల్లాలోని రేషన్‌కార్డుదారులకు సన్నబియ్యం పంపిణీ చేసేందుకు సర్వం సిద్ధమవుతోంది. ఈ నెల 30న ఉగాది రోజు సీఎం రేవంత్‌రెడ్డి సన్నబియ్యం పంపిణీ ప్రారంభించనున్నారు. వచ్చే నెల 1 నుంచి తెల్లరేషన్ కార్డుదారులకు సన్నబియ్యం పంపిణీ చేసేలా జిల్లా పౌరసరఫరా శాఖ అధికారులు చర్యలు చేపడుతున్నారు. ఇప్పటికే మండల లెవల్ స్టాక్ (ఎంఎల్ఎస్) పాయింట్ల నుంచి రేషన్‌దుకాణాలకు సన్నబియ్యం సరఫరా అవుతోంది. ఒక్కరికి 6 కిలోల చొప్పున జిల్లాలోని కార్డుదారులకు 7,540 మెట్రిక్ టన్నుల సన్నబియ్యం అవసరమని అధికారులు అంచనా వేశారు. ఇటీవల కొత్తగా రేషన్‌కార్డులు పొందిన వారికి కూడా కోటా ఇవ్వనున్నారు. జిల్లాలోని ఎంఎల్ఎస్ పాయింట్ల ద్వారా 500 పైచిలుకు రేషన్ దుకాణాలకు సన్నబియ్యం చేరినట్లు అధికారవర్గాల ద్వారా తెలిసింది. బియ్యం పంపిణీకి మరో నాలుగు రోజులే మిగిలి ఉండడంతో సరఫరాను వేగవంతం చేసేలా కలెక్టర్, అదనపు కలెక్టర్ ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.



రీసైక్లింగ్‌కు చెక్

ప్రభుత్వం సన్నబియ్యం పంపిణీ చేయనుండడంతో రేషన్ బియ్యం పక్కదారి పట్టకుండా అడ్డుకట్ట పడనుంది. ఇప్పటివరకు దొడ్డు బియ్యం పంపిణీ చేస్తుండగా, చాలామంది తినడం లేదనేది బహిరంగ రహస్యం. వాటిని కిలోకు రూ.15 నుంచి రూ.18 వరకు విక్రయించేవారు. దొడ్డు బియ్యం అక్రమార్కులకు ఆదాయ వనరుగా మారాయి. ఇలా విక్రయించిన బియ్యం మిల్లులకు చేరుతాయనే ఆరోపణలు ఉన్నాయి. మిల్లర్లు రీసైక్లింగ్ చేసి తిరిగి పౌరసరఫరాల శాఖకు అప్పగించడం ఆనవాయితీగా మారింది. నిత్యం ఏదో ఒకచోట క్వింటాళ్ల కొద్దీ రేషన్ బియ్యాన్ని అధికారులు పట్టుకునేవారు. కానీ సన్నబియ్యం పంపిణీతో రీసైక్లింగ్ దందాకు చెక్‌పడే అవకాశాలు ఉన్నాయి.

ఏర్పాట్లు పూర్తి చేశాం

జిల్లాలోని అన్ని రేషన్‌దుకాణాల్లో వచ్చే నెల 1 నుంచి సన్నబియ్యం పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు పూర్తి చేశాం. ఎంఎల్ఎస్ పాయింట్ల ద్వారా చౌకధరల దుకాణాలకు బియ్యం సరఫరా జరుగుతోంది. మన జిల్లా నుంచే ఇతర జిల్లాలకు బియ్యం పంపిస్తున్నాం. సన్నబియ్యం పంపిణీపై ఎప్పటికప్పుడు సంబంధిత అధికారులతో సమీక్షిస్తున్నాం. ఎక్కడ కూడా లోటుపాట్లు లేకుండా చర్యలు చేపడుతున్నాం. – కిరణ్‌కుమార్, అదనపు కలెక్టర్

ఆయిల్ పామ్‌పై అనాసక్తి

- సాగుకు ముందుకురాని రైతులు
- ఈ ఏడాది సగం కూడా దాటని లక్ష్యం
- సరైన కార్యాచరణ చేపట్టని ఉద్యాన శాఖ

డొంకేశ్వర్(ఆర్మూర్) : జిల్లాలో ఆయిల్‌పామ్ సాగు నెమ్మదించింది. మూడేళ్ల క్రితం ఆసక్తి చూపిన రైతులు.. ప్రస్తుతం అనాసక్తి కనబరుస్తున్నారు. ఆయిల్‌పామ్ అంటేనే వెనకడుగు వేస్తున్నారు. పంటను విక్రయించేందుకు జిల్లాలో ఇంతవరకూ ఫ్యాక్టరీ ఏర్పాటు కాకపోవడంతో సాగు చేయడానికి ఆలోచిస్తున్నారు. దీంతో ఈ ఆర్థిక సంవత్సరానికి ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యంలో సగం కూడా చేరలేదు. ఉద్యాన శాఖ వద్ద సరైన కార్యాచరణ లేకపోవడంతో పాటు రైతులకు భరోసా ఇవ్వకపోవడం కారణంగా ఈ ఆర్థిక సంవత్సరంలో వెయ్యి ఎకరాల్లో కూడా సాగు చేయలేదు. ఈ నెలాఖరు నాటికి 2,500 ఎకరాలు సాగు చేయాల్సి ఉండగా, అధికారులు ఏం చేసినా ఈ టార్గెట్‌ను చేరుకునే పరిస్థితి కనిపించడం లేదు.

నాలుగేళ్లలో 6,500 ఎకరాలు మాత్రమే...

లాభాలు కలిగిన ఆయిల్‌పామ్ తోటను సాగు చేసిన రైతులకు సబ్సిడీ ఇస్తామని ప్రభుత్వం చెప్పడంతో 2022లో జిల్లాలో దీని సాగును ప్రారంభించారు. జిల్లాలో ఏడాదికి నాలుగు వేల ఎకరాల్లో సాగు చేయాలని ఉద్యాన శాఖకు లక్ష్యాన్ని నిర్దేశించారు. ఏటా లక్ష్యాన్ని చేరుకోవడం ఇబ్బందిగా మారడంతో దానిని కుదించారు. నాలుగేళ్లలో కొంత వరకు రైతులు ముందుకు వచ్చి 6,500 ఎకరాల్లో మాత్రమే సాగు చేశారు. ప్రభుత్వం నుంచి బిందు సేద్యం యూనిట్ల మంజూరులో జాప్యం ఏర్పడడంతో సాగు చేయడానికి ఆసక్తి చూపడం లేదు.



డొంకేశ్వర్ మండలం నూత్‌పల్లిలో సాగవుతున్న ఆయిల్‌పామ్

జిల్లాలో ఆయిల్‌పామ్ సాగు ఇలా..

ఈ ఏడాది లక్ష్యం	2,500ఎకరాలు
సాగు చేసింది	980 ఎకరాలు
ముందుకు వచ్చిన రైతులు	507 మంది
ఇంకా సాగు చేయాల్సింది	1,520 ఎకరాలు

మరింత అవగాహన కల్పిస్తాం

జిల్లాలో ఆయిల్‌పామ్ సాగును పెంచేలా చర్యలు తీసుకుంటాం. రైతులకు మరింత విస్తృతంగా అవగాహన కల్పిస్తాం. కొన్ని పరిస్థితుల కారణంగా ఈ ఏడాది లక్ష్యాన్ని అందుకోలేకపోయాం. లోపాలను సరిదిద్దుకొని వచ్చే ఏడాది టార్గెట్‌ను పూర్తి చేయడానికి కార్యాచరణ రూపొందిస్తాం.

– శ్రీనివాస్, జిల్లా ఉద్యాన శాఖ అధికారి

రేషన్ అక్రమ రవాణాను అరికట్టాలి

ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి



ఆర్మూర్: రేషన్ బియ్యం అక్రమ రవాణాను అరికట్టాలని, పేదల బియ్యం పక్కదారి పట్టకుండా చూసే బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదేనని ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి అన్నారు. అసెంబ్లీలో గురువారం ఆయన మాట్లాడుతూ.. ఉగాది నుంచి రేషన్‌లో సన్నబియ్యం పంపిణీ చేస్తున్నందున వాటిని పక్కదారి పట్టకుండా చూడాలన్నారు. మహారాష్ట్ర బోర్డర్‌లో ఉండడంతో నిజామాబాద్ నుంచి ఎక్కువగా బియ్యం అక్రమంగా తరలింపు జరుగుతోందన్నారు. జిల్లాకు చెందిన ఓ మాజీ ఎమ్మెల్యే కూడా రేషన్ బియ్యాన్ని అమ్ముకున్నారని ఆరోపించారు. సీనియర్ మంత్రులతో కమిటీ వేసి బియ్యం అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలని డిమాండ్ చేశారు. రేషన్ కార్డులు అర్హులకే ఇవ్వాలని అన్నారు.

ఇరిగేషన్ పనులు పూర్తి చేయండి

- అసెంబ్లీలో ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి

వేల్పూర్ : బాల్కొండ నియోజకవర్గంలో ఇరిగేషన్ పనులను త్వరగా పూర్తిచేయాలని ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి గురువారం శాసనసభ జీరో అవర్‌లో ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. ప్యాకేజీ 21ఏ పనులు వేగిరంగా పూర్తిచేసి రైతాంగానికి సాగునీరు ఇవ్వాలని కోరారు. బాల్కొండ, నిజామాబాద్ రూరల్, ఆర్మూర్, మెట్‌పల్లి నియోజకవర్గాల్లో సుమారు 2,12,000 ఎకరాలకు సాగునీరు ఇచ్చేందుకు నిర్దేశించిన ప్రాజెక్టు 20, 21, 21ఏ అని పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో రూ. 4,800 కోట్లతో పనులు చేపట్టగా 70 శాతం పూర్తయ్యాయని, పనుల కోసం సుమారు రూ. 3,300 కోట్లు ఖర్చు చేసినట్లు తెలిపారు. ప్యాకేజీ 21ఏ మెట్‌పల్లి, బాల్కొండ నియోజకవర్గాల్లో 80 వేల ఎకరాలు, నిజామాబాద్ రూరల్, జక్రాన్‌పల్లి మండలాల్లో 28 వేల ఎకరాలు, ఆర్మూర్ నియోజకవర్గంలో 12 వేల ఎకరాలకు సాగునీరు అందించవచ్చని చెప్పారు. ప్యాకేజీ 21ఏలో 80 శాతం పనులు పూర్తయ్యాయని, మిగతా 20 శాతం పనులు పూర్తి చేస్తే 6 నెలల్లోనే లక్షా 20 వేల ఎకరాలకు సాగునీరు అందుతుందని పేర్కొన్నారు. అదే విధంగా 9,274 ఎకరాలకు సాగు నీరందించే చిట్టాపూర్, సుర్భిర్యాల్, ఫత్తేపూర్ ఎత్తిపోతల పనులను పూర్తి చేయాలని కోరారు. రూ. 150 కోట్లతో ఈ ప్రాజెక్టు చేపట్టామని, బాల్కొండ నియోజకవర్గంలో బాల్కొండ, చిట్టాపూర్, శ్రీరాంపూర్ గ్రామాలకు రూ. 60 కోట్లతో 3,474 ఎకరాలు, ఆర్మూర్ నియోజకవర్గంలో ఫత్తేపూర్, సుర్భిర్యాల్ గ్రామాలకు రూ. 90 కోట్లతో 5,800 ఎకరాలకు సాగునీరు అందించవచ్చని తెలిపారు. పనులు నెమ్మదిగా సాగుతున్నాయని, వేగవంతం చేసి త్వరగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే కోరారు.



అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వేముల

క్లుప్తంగా

మహిళా సాధికారతపై చర్చ అభినందనీయం



సీఎం రేవంత్‌ను కలిసిన గడుగు, పీసీసీ చీఫ్‌

నిజామాబాద్‌ సిటీ: మహిళా సాధికారత ప్రాముఖ్యతను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కౌన్సిల్‌లో ప్రస్తావించడం అభినందనీయమని రైతు కమిషన్‌ సభ్యుడు గడుగు గంగాధర్‌ అన్నారు. ఈసందర్భంగా హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డిని గురువారం ఆయన పీసీసీ చీఫ్‌ మహేష్‌ కుమార్‌గౌడ్‌తోపాటు కలిశారు. కౌన్సిల్‌లో మహిళా సాధికారత సాధ్యాసాధ్యాలపై చర్చించడం అభినందనీయమన్నారు. మహిళల హక్కులు, సంక్షేమం, సమానత్వాన్ని, చట్ట సభలలో మహిళల ప్రాతినిధ్యాన్ని ముందుకు తీసుకెళ్లేవిధంగా ప్రభుత్వం కృషి చేస్తుండటం శుభ పరిణామం అన్నారు.

నేడు నగరంలో బీజేపీ రైతు సత్యాగ్రహ దీక్ష

సుభాష్‌నగర్‌: రైతాంగ సమస్యలు పరిష్కరించాలనే డిమాండ్‌తో బీజేపీ కిసాన్‌ మోర్చా ఆధ్వర్యంలో శుక్రవారం నగరంలోని పాత కలెక్టరేట్‌ వద్ద రైతు సత్యాగ్రహ దీక్ష చేపడుతున్నట్లు జిల్లా అధ్యక్షుడు పాట్కూరి తిరుపతిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. రూ.2లక్షల రుణ మాఫీ హామీని సంపూర్ణంగా అమలు చేయాలని, రైతు భరోసా నిధులు తక్షణమే జమ చేయాలని డిమాండ్‌చేశారు. ధాన్యం, మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు వెంటనే ప్రారంభించాలని, అతివృష్టి, అనావృష్టితో పంటలు నష్టపోయిన రైతాంగానికి పరిహారం ఇచ్చి ఆదుకోవాలన్నారు. రైతు సత్యాగ్రహ దీక్షకు నిజామాబాద్‌ అర్బన్‌, ఆర్మూర్‌ ఎమ్మెల్యేలు ధన్‌పాల్‌ సూర్యనారాయణ, పైడి రాకేష్‌రెడ్డి, జాతీయ పసుపు బోర్డు చైర్మన్‌ పల్లె గంగారెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్‌ పటేల్‌ కులాచారి ముఖ్యఅతిథులుగా హాజరుకానున్నారని తెలిపారు. జిల్లా నలుమూలల నుంచి రైతులు సత్యాగ్రహ దీక్షకు తరలివచ్చి విజయవంతం చేయాలని ఆయన కోరారు.

రుద్రూర్‌లో వైన్స్‌ షాపు తనిఖీ



రుద్రూర్‌లో మద్యం బాటిళ్లను పరిశీలిస్తున్న బోధన్‌ ఎక్సైజ్‌ సీఐ భాస్కర్‌

రుద్రూర్‌: మండల కేంద్రంలోని వైన్స్‌ దుకాణాన్ని బోధన్‌ ఎక్సైజ్‌ సీఐ భాస్కర్‌ తనిఖీ చేశారు. వైన్స్‌లోని మద్యం బాటిళ్లు, స్టాక్‌ రిపోర్ట్‌, రిజిష్టర్లను పరిశీలించారు. సమయ పాలన పాటించాలని, నకిలీ మద్యం విక్రయించవద్దని సిబ్బందికి సూచించారు.

గ్రామానికో పాలన అధికారి

- రెవెన్యూ శాఖలో జీపీవోలు
- రద్దు చేసిన వీఆర్వోల స్థానంలో కొత్తగా నియామకం
- పూర్వ వీఆర్వో, వీఆర్‌ఏల నుంచి ఆప్షన్‌ కోరుతున్న అధికారులు
- ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం



ఏర్గట్ల గ్రామ ముఖచిత్రం(ఫైల్‌)

మోర్తాడ్‌(బాల్కొండ): గ్రామస్థాయిలో రెవెన్యూ శాఖను బలోపేతం చేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తోంది. గ్రామీణ ప్రజలకు సేవలు అందించేందుకు గ్రామ పాలనాధికారి (జీపీవో) పేరిట కొత్త అధికారులను అందుబాటులోకి తేనుంది. అందులో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ఉత్తర్వులను జారీచేయగా రాష్ట్ర వ్యాప్తంగా 10,954 జీపీవో పోస్టుల భర్తీకి చర్యలు చేపట్టాలని రెవెన్యూ ఉన్నతాధికారులను ఆదేశించింది. కాగా, రెవెన్యూ వ్యవస్థపై అనుభవం ఉండి, గతంలో వీఆర్వో, వీఆర్‌ఏలుగా పనిచేసి ఇతర శాఖల్లో విలీనమైన ఉద్యోగుల నుంచి జీపీవోలుగా పనిచేసేందుకు ప్రభుత్వం ఆప్షన్‌ కోరుతోంది. కొంతమంది వీఆర్‌ఏలు రెవెన్యూ శాఖలోనే పనిచేస్తుండగా, వీఆర్వోలు మాత్రం వైద్య, విద్య, నీటిపారుదల, వ్యవసాయ, పంచాయతీరాజ్‌, మున్సిపల్‌ తదితర శాఖల్లో విధులు నిర్వర్తిస్తున్నారు.

పోస్టులపై స్పష్టత కరువు..

రాష్ట్ర వ్యాప్తంగా జీపీవోల సంఖ్యను ప్రకటించిన ప్రభుత్వం జిల్లాల వారీగా కేటాయించే పోస్టులపై స్పష్టత ఇవ్వాల్సి ఉంది. గతంలో రెవెన్యూ గ్రామాల వారీగా వీఆర్వోలు పనిచేశారు. ప్రస్తుతం అదే తరహాలో జీపీవోలను నియమిస్తారా? అనే విషయంలో ప్రభుత్వం మార్గదర్శకాలను జారీ చేస్తేనే తెలుస్తుంది. జిల్లాలో కొత్తగా ఏర్పడిన గ్రామ పంచాయతీలతోపాటు పాత గ్రామ పంచాయతీలు కలిపి 540 ఉన్నాయి. రెవెన్యూ గ్రామాలు 450 ఉన్నాయి. రెవెన్యూ గ్రామాల వారీగా జీపీవోలను నియమిస్తే మున్సిపాలిటీలలో రెవెన్యూకు సంబంధించి ఏవిధమైన చర్యలు తీసుకుంటారనే విషయంలో ప్రభుత్వం స్పష్టత ఇవ్వాల్సి ఉంది. వీఆర్వోల వ్యవస్థ రద్దు చేసిన నుంచి తమ శాఖకు సంబంధించి ఎన్నో అంశాలపై పంచాయతీరాజ్‌ శాఖ ఉద్యోగులపైనే ఆధారపడ్డామని రెవెన్యూ అధికారులు చెబుతున్నారు. ఇప్పుడు జీపీవోల నియామకం పూర్తి చేస్తే రెవెన్యూ శాఖకు కొంత బలం చేకూరుతుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

మార్గదర్శకాలు వస్తేనే స్పష్టత

గ్రామపాలన అధికారుల నియామకం కోసం ప్రభుత్వం గతంలోనే పూర్వ వీఆర్వో, వీఆర్‌ఏల నుంచి ఆప్షన్‌ స్వీకరించింది. మార్గదర్శకాలు వస్తేనే జీపీవోల నియామకం, వారి విధుల నిర్వహణ ఇతర అంశాలపై స్పష్టత వస్తుంది. జీపీవోల నియామకంతో రెవెన్యూ శాఖకు ఇబ్బందులు తొలగిపోనున్నాయి.

– రాజాగౌడ్‌, ఆర్డీవో, ఆర్మూర్‌

గతంలో ఇలా..

జిల్లాలో వీఆర్వోలుగా పనిచేసిన 272 మందిని ఇతర శాఖల్లో విలీనం చేశారు. 1,270 మంది వీఆర్‌ఏలు ఉండగా ఇందులో 60ఏళ్ల పైబడిన వారు 200ల మంది ఉంటారు. వీరు తప్ప మిగిలిన వారంతా ఇతర శాఖలకు బదిలీ అయ్యారు. రెవెన్యూ గ్రామాల వారీగా జీపీవోలను నియమిస్తే 450 మందికి మాత్రమే వారి మాతృశాఖలోకి చేరేందుకు అవకాశం కలుగనుంది. ఇప్పటి వరకు ఆన్‌లైన్‌లో దాదాపు 700 మంది వరకు ఉద్యోగులు ఆప్షన్‌లు ఇచ్చినట్లు తెలుస్తోంది.

పల్లెల్లో భూ వివాదాలు

- రెండు వర్గాలుగా విడిపోతున్న పలు గ్రామాల ప్రజలు
- నాగంపేట్‌లో మళ్లీ ముదురుతున్న గొడవ

బాల్కొండ: పచ్చని పల్లెల్లో భూ వివాదాలు చల్లారేదెప్పుడూ అంటూ ప్రజలు బిక్కుబిక్కుమంటూ ఎదురు చూస్తున్నారు. ముప్కాల్‌ మండలం నాగంపేట్‌ గ్రామంలో భూ వివాదం కారణంగా గురడిరెడ్డి, సహకార సంఘం(ఎస్సీ, బీసీ, మైనారిటీలు) రెండు వర్గాలుగా విడిపోవుటకు దారితీసింది. దీంతో ఆరేళ్లుగా ఆ రెండు వర్గాల మధ్య మాటలు లేవు. శుభా అశుభా కార్యాలకు వెళ్లేది లేదు. ప్రతి ఉగాదికి ఉత్సవాలను సైతం ఎవరికి వారే నిర్వహించుకుంటారు. ప్రస్తుత సంవత్సరం ఆలయ రథం గురించి మళ్లీ వివాదం తలెత్తింది. ఆలయం కోసం ఏర్పాటు చేసిన శాశ్వత చందా నిధి నుంచి ఓ వర్గం వారు రథం తయారు చేయించారు. దీంతో అందరం కలిసి రథోత్సవం చేయాలని మరో వర్గం వారు అంటున్నారు. కుదరదని తయారు చేయించిన వర్గం అంటున్నాట్లు సమాచారం. దీంతో సమస్య మళ్లీ తలెత్తినట్లు తెలుస్తోంది. ముప్కాల్‌ మండలం కొత్తపల్లి, మెండోరా మండలం బుస్సాపూర్‌లో భూవివాదం కారణంగా గురడిరెడ్డి సంఘం సభ్యులు, ఇతర కులస్తులు రెండు వర్గాలుగా విడిపోయారు. ఒక వర్గం, మరో వర్గంతో మాట్లాడిన శుభ, అశుభ కార్యక్రమాలకు వెళ్లిన జరిమానాలు విధించుకుంటారు. మెండోరాలో భూ వివాదంతో ప్రజలు రెండు వర్గాలుగా విడిపోయారు. బాల్కొండ మండలం బస్సాపూర్‌ గ్రామంలో ఓ భవన నిర్మాణ స్థలం కోసం మున్నూరు కాపు సంఘ సభ్యులు, ఇతర కులస్తులు రెండు వర్గాలుగా విడిపోయారు. ముప్కాల్‌ మండలం వెంచిర్యాల్‌ గ్రామంలో భూ సమస్యతో 25 మంది గురడిరెడ్డి సంఘ సభ్యులకు, మిగతా గ్రామస్తులకు కొంత కాలంగా వివాదం జరుగుతుంది. దీంతో ఆయా గ్రామాల్లో వివాదాలు ముగిసి, అందరూ కలిసి ఉండేలాని ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

ఏ పెళ్లికి వెళ్లినా స్టీల్‌ ప్లేట్‌ వెంట ఉండాల్సిందే



పెళ్లిలో ఇంటి నుంచి తెచ్చుకున్న స్టీల్‌ ప్లేటులో భోజనం చేస్తున్న అరవింద్‌

మద్నూర్‌(జుక్కల్‌) : ఎక్కడ ఏపెళ్లికి వెళ్లిన స్టీల్‌ ప్లేట్‌లోనే భోజనం చేస్తానని మద్నూర్‌కు చెందిన తమ్మేవార్‌ అరవింద్‌ పేర్కొన్నాడు. సంవత్సరం నుంచి ఏ ఫంక్షన్‌కు వెళ్లిన ఇంటి నుంచి స్టీల్‌ ప్లేటు తీసుకువెళ్తానని, తనతో పాటు తన భార్య కూడా స్టీల్‌ ప్లేట్‌లోనే భోజనం చేస్తుందని ఆయన తెలిపారు. పర్యావరణ పరిరక్షణకు తమవంతు బాధ్యతగా ప్లాస్టిక్‌ విస్తరాకులు, గ్లాస్‌లు ఉపయోగించమని పేర్కొన్నారు. ప్రకృతి కోసం, భావితరాల కోసం తమవంతుగా ప్లాస్టిక్‌ను నిషేధిస్తున్నామన్నారు. ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్‌ వాడకాన్ని పూర్తిగా తగ్గించాలని ఆయన కోరారు. పర్యావరణాన్ని కాపాడేందుకు త్వరలో వెయ్యి స్టీల్‌ ప్లేట్లు కొనుగోలు చేసి మద్నూర్‌లో ఏ ఫంక్షన్‌ జరిగిన పంపిణీ చేస్తానని వెల్లడించారు.

సిట్‌ విచారణపై హర్షం

సుభాష్‌నగర్‌: తెలంగాణలో బెట్టింగ్‌ యాప్‌ మాఫియాపై సీఎం రేవంత్‌రెడ్డి సిట్‌ విచారణకు ఆదేశించడంపై నిజామాబాద్‌ అర్బన్‌ ఎమ్మెల్యే ధన్‌పాల్‌ సూర్యనారాయణ ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. బెట్టింగ్‌ యాప్‌పై ఇటీవల అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా అర్బన్‌ ఎమ్మెల్యే ప్రస్తావించిన విషయం తెలిసిందే. దీంతో ప్రభుత్వం స్పందించి బెట్టింగ్‌ యాప్‌ మాఫియాపై అసెంబ్లీలో సిట్‌ విచారణకు ఆదేశించడాన్ని స్వాగతిస్తూ.. సీఎం రేవంత్‌రెడ్డికి ఎమ్మెల్యే ధన్‌పాల్‌ సూర్యనారాయణ ధన్యవాదాలు తెలియజేశారు.

ఎండుతున్న వరి పైరు



సోమారంపేటలో గొర్రెలు మేస్తున్న వరిచేను

మాచారెడ్డి : భూగర్భజలాలు తగ్గిపోవడంతో బోర్లు ఎత్తిపోతున్నాయి. మాచారెడ్డి మండలం ఎల్లంపేట గ్రామానికి చెందిన మాలోత్‌ మోహన్‌ అనే రైతు తన కున్న రెండెకరాల పొలంలో నాటు వేశాడు. పదిహేను రోజుల నుంచి వ్యవసాయ బావిలో నీరు ఇంకిపోవడంతో సగం వరకు ఎండిపోయిందని వాపోయాడు.అదే గ్రామానికి చెందిన మాలోత్‌ కిష్ట్యా రెండు బోరు బావులు తవ్వించి రెండెకరాలు సాగు చేశాడు. బోరుబావి వట్టిపోవడంతో సగం పొలం ఎండిపోయిందని ఆవేదన వ్యక్తం చేశాడు.

బాల్‌ భవన్‌లో ఉచిత శిక్షణ తరగతులు

- ఏప్రిల్‌ 2 నుంచి అడ్మిషన్లు ప్రారంభం
- వచ్చే నెల 16 నుంచి జూన్‌ 10 వరకు తరగతుల నిర్వహణ



నిజామాబాద్‌ రూరల్‌: వేసవి సెలవుల్లో విద్యార్థులు తమకు నచ్చిన కళలను నేర్చుకోవడానికి జిల్లా కేంద్రంలోని బాల్‌భవన్‌ ఉచిత శిక్షణ తరగతులను ఏర్పాటు చేస్తోంది. చదువుతోపాటు, ఆట–పాటలు సమాంతరంగా సాగినపుడే బాలల్లోని సృజనాత్మకత పదునెక్కి సంపూర్ణ వ్యక్తిత్వ వికాసం చేకురుతుంది. ఈక్రమంలో వేసవి సెలవులను వృథా చేయకుండా విద్యార్థులు తమకు ఇష్టమైన రంగంలో రాణించేందుకు శిక్షణను ఇచ్చేలా తరగతుల నిర్వహణ చేపట్టనున్నారు. సంగీతం, డ్రాయింగ్‌, నృత్యం, శ్లోకాల పఠనం, వివిధ వస్తువుల తయారీ, యోగా, కర్రసాము వంటి సుమారు 30 అంశాలపై సిబ్బంది శిక్షణ ఇవ్వనున్నారు.

సుమారు 600 మందికి ప్రవేశం..

జిల్లా కేంద్రంలోని బాల్‌భవన్‌లో 5 సంవత్సరాల నుంచి 16 సంవత్సరాల లోపు పిల్లలకు ఉచితంగా అడ్మిషన్లు ఇవ్వనున్నారు. ఇందుకోసం వచ్చే నెల ఏప్రిల్‌ 2 నుంచి బాల్‌భవన్‌లో ఆసక్తి కల విద్యార్థులు తమ పేర్లను నమోదు చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. సుమారు 600 మంది విద్యార్థులకు ప్రవేశాలు కల్పించనున్నట్లు బాల్‌భవన్‌ సిబ్బంది తెలిపారు. అడ్మిషన్ల ప్రక్రియ ముగిన తర్వాత ఏప్రిల్‌ 16 నుంచి జూన్‌ 10వరకు విద్యార్థులకు ఆయా అంశాలపై శిక్షణ తరగతులు నిర్వహించనున్నారు. శిక్షణ తరగతులు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కొనసాగనున్నాయి. ఈ సమయంలో శిక్షణ పొందే విద్యార్థులు భోజనంను ఇంటి నుంచే వెంటతీసుకొని రావాలన్నారు. అడ్మిషన్ల కోసం బర్త్‌ సర్టిఫికెట్‌, రెండు పాస్‌పోర్ట్‌ సైజ్‌ ఫోటోలు తీసుకు రావాలి. బాల్‌ భవన్‌ ఇన్‌చార్జి ఉమాబాల ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2:30 వరకు కార్యాలయంలో అందుబాటులో ఉండనున్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

బాల్‌భవన్‌లో వేసవి ప్రత్యేక తరగతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి. కళల పట్ల ఆసక్తి కలిగేల తల్లిదండ్రులు పిల్లలకు అవగాహన కల్పించి బాల్‌భవన్‌కు వచ్చే విధంగా ప్రోత్సహించాలి. విద్యతోపాటు కళలు కూడా జీవితంలో ఎంతో ముఖ్యమైంది. సకాలంలో విద్యార్థులు అడ్మిషన్లు తీసుకొని తరగతులకు హాజరుకావాలి.

– ఉమాబాల, ఇన్‌చార్జి, బాల్‌భవన్‌

గుదిబండగా ప్రభుత్వ కార్యాలయాలు

నిజామాబాద్‌ సిటీ: నిజామాబాద్‌ మున్సిపల్‌ కార్పొరేషన్‌ పరిధిలోని ప్రభుత్వ కార్యాలయాలు గత కొన్నేళ్లుగా ఆస్తిపన్ను చెల్లించడం లేదు. ఆయా శాఖల బకాయిల వివరాలు ఇలా..

ప్రభుత్వ కార్యాలయం	బకాయిలు (రూ. వేలల్లో)
మత్స్యశాఖ	72

ప్రభుత్వ కార్యాలయం	బకాయిలు (రూ. కోట్లలో)
ఆరోగ్య శాఖ	23.35
జిల్లా పరిషత్‌	3.12
ఆర్‌ అండ్‌ బీ	2.25
పోలీసు శాఖ	1.53
అటవీ శాఖ	1.30

ప్రభుత్వ కార్యాలయం	బకాయిలు (రూ. లక్షల్లో)
మార్కెట్‌ కమిటీ	60.97
విద్యాశాఖ	20.81
మార్క్‌ఫెడ్‌	77.57
మార్కెటింగ్‌ శాఖ	51.21
సోషల్‌ వెల్ఫేర్‌	18.19
ఇంజనీరింగ్‌ శాఖ	13.66
విద్యుత్‌ శాఖ	12.74
జిల్లా జైలు శాఖ	86.52
పశుసంవర్ధక శాఖ	13.40
నెహ్రూ యువకేంద్రం	8.86
సోషల్‌ వెల్ఫేర్‌ శాఖ	3.46
సాత్‌ ఎమ్మార్వో	2.51
యునాని హాస్పిటల్‌	1.20

పూడిక కోసం చెరువు నీటి తొలగింపు





మోటార్‌ సాయంతో చెరువు నుంచి నీటిని బయటకు తరలిస్తున్న దృశ్యం, ఎండిపోయిన సోన్‌పేట్‌ చెరువు

బాల్కొండ: మెండోరా మండలం సోన్‌పేట్‌ గ్రామ చెరువులో పూడిక తీయుట కోసం గ్రామస్తులు చెరువులోని నీటిని బయటకు తరలిస్తున్నారు. చెరువులో పూడిక అధికంగా ఉండటంతో నీటి నిల్వ సామర్థ్యం తగ్గిపోయింది. దీంతో గ్రామస్తులు ప్రస్తుత యాసంగిలో పంటలను సాగు చేయవద్దని నిర్ణయించి, చెరువులో నీటిని ఖాళీ చేయించారు. ప్రస్తుతం చివరన ఉన్న కొద్దిపాటి నీటిని సైతం మోటార సాయంతో బయటకు తరలిస్తున్నారు. దీంతో చెరువులో నీరులేక ఎండిపోయింది.

రసవత్తరంగా కుస్తీ పోటీలు



కుస్తీ పోటీల్లో తలపడుతున్న మల్లయోధులు

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని బోనాల్‌ గ్రామంలోని ప్రభుస్వామి ఆలయం వద్ద గురువారం గ్రామ కమిటీ ఆధ్వర్యంలో కుస్తీ పోటీలు రసవత్తరంగా సాగాయి. ఈ సందర్భంగా టెంకాయ కుస్తీ నుంచి రెండు తులాల వెండి కడెం వరకు కుస్తీ పోటీలు నిర్వహించారు. విజేతలకు నగదు బహుమతులు అందజేశారు. చివరి కుస్తీలో 2 తులాల వెండి కడెంను విజేతకు బహుకరించారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు, ఆలయకమిటీ సభ్యులు, పాల్గొన్నారు.

చోరీ కేసులో ఒకరి రిమాండ్‌

లింగంపేట(ఎల్లారెడ్డి): చోరీ కేసులో ఒకరిని రిమాండ్‌కు తరలించినట్లు ఎల్లారెడ్డి సీఐ రవీందర్‌ తెలిపారు. లింగంపేట పోలీస్‌ స్టేషన్‌లో గురువారం ఆయన వివరాలు వెల్లడించారు. మండలంలోని కన్నాపూర్‌ గ్రామానికి చెందిన గ్యారవోయిన శ్రీకాంత్‌ అనే వ్యక్తి ఈ నెల 19న నల్లమడుగు గ్రామానికి చెందిన ఎట్టెం సిద్దయ్య ఇంట్లో కూలీ పనికి వచ్చి రాత్రివేళ చోరీకి పాల్పడ్డాడు. రూ.2.30లక్షల నగదు, వెండి ఆభరణాలు, సెల్‌ ఫోన్‌, అలాగే పరి చయస్తుడి బైక్‌ చోరీ చేసి పారిపోయాడు. బాధితుడు సిద్ధయ్య ఫిర్యాదు మేరకు ఏఎస్సై ప్రకాష్‌నాయక్‌ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించాడు. ఈక్రమంలో గురువారం పొల్కంపేట చౌరస్తాలో నిందితుడు శ్రీకాంత్‌ను పోలీసులు పట్టుకున్నారు. అతడి వద్ద నుంచి రూ. 17వేల నగదు, ఒక జత వెండి పట్టి గొలుసు, వెండి బ్రాస్‌లెట్‌, మూడు వెండి ఉంగరాలు, సెల్‌ఫోన్‌ రికవరీ చేసినట్లు తెలిపారు. నిందితుడిపై కీసర, లింగంపేట, రామాయంపేట, సదాశివనగర్‌ పోలీస్‌ స్టేషన్‌లలో కేసులు నమోదైనట్లు తెలిపారు. 2024 ఆగస్టులో ఓ మర్డర్‌ కేసులో రిమాండ్‌కు తరలించగా, ఈ మధ్యనే సంగారెడ్డి జైలు నుంచి విడుదలై తిరిగి నేరాలకు పాల్పడుతున్నాడన్నారు. చోరీ కేసును వారం రోజుల్లో ఛేదించిన ఏఎస్సై ప్రకాష్‌ నాయక్‌తోపాటు సిబ్బందిని అభినందించారు.

ప్రాణం తీసిన కారు పంచాయితీ!



రమేశ్‌ (ఫైల్‌)

దోమకొండ: ఒక కారు ఇన్‌స్టాల్‌మెంట్‌ల విషయంలో ఇద్దరు వ్యక్తుల మధ్య నెలకొన్న పంచాయితీ నిండు ప్రాణాన్ని బలితీసుకుంది. వివరాలిలా ఉన్నాయి. ముత్యంపేట గ్రామానికి చెందిన ఈరబోయిన రమేశ్‌(35) కొంత కాలం క్రితం చింతమాన్‌పల్లి గ్రామానికి చెందిన ఇటుకబట్టి నిర్వాహకుడు పల్లె పోశయ్యకు తన కారును విక్రయించాడు. కారుకు సంబంధించిన ఇన్‌స్టాల్‌మెంట్‌ల చెల్లింపు విషయంలో ఇద్దరి మధ్య ఒప్పందం జరిగింది. అయితే పల్లె పోశయ్య ఇన్‌స్టాల్‌మెంట్‌ డబ్బులు చెల్లించకపోవడంతో లోన్‌ ఇచ్చిన కంపెనీ ప్రతినిధులు రమేశ్‌కు ఫోన్‌ చేసి డబ్బులు కట్టాలని అడుగుతున్నారు. దీంతో బుధవారం సాయంత్రం ఈ విషయమై రమేశ్‌, పోశయ్యల మధ్య వాగ్వాదం జరిగింది. తన కారు తాను తీసుకువెళ్లాలని నిర్ణయించుకున్న రమేశ్‌.. గురువారం తెల్లవారుజామున చింతమాన్‌పల్లి శివారులోని ఇటుకబట్టి వద్దకు వెళ్లి రెండో కీతో కారును స్టార్ట్‌ చేశాడు. దీనిని గమనించిన పల్లె పోశయ్య, ఇటుక బట్టి కూలీలు రమేశ్‌ను అడ్డుకున్నారు. ఈ క్రమంలో కారు ముందుకు కదలడంతో పోశయ్య కాలుకు గాయమైంది. దీంతో ఆగ్రహించిన కూలీలు రమేశ్‌పై కర్రలతో దాడిచేసి తీవ్రంగా గాయపరిచారు. విషయం తెలుసుకున్న రమేశ్‌ కుటుంబ సభ్యులు సంఘటన స్థలానికి వచ్చారు. రమేశ్‌ను ఆటోలో కామారెడ్డి ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందాడని వైద్యులు నిర్ధారించారు. భిక్కనూరు సీఐ సంపత్‌కుమార్‌, దోమకొండ ఎస్సై స్రవంతి సంఘటన స్థలాన్ని పరిశీలించారు. గొడవలు జరగకుండా పోలీసులు చర్యలు తీసుకున్నారు. మృతుడు రమేశ్‌ గ్రామంలో గోపాలమిత్రగా పనిచేసేవాడు. ఆయనకు భార్య, కుమారుడు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నామని పోలీసులు తెలిపారు.

జక్రాన్‌పల్లి వీడీసీపై ఫిర్యాదు

ఖలీల్‌వాడి: జక్రాన్‌పల్లి వీడీసీపై బాధితురాలు సుంకరి స్రవంతి గురువారం సీపీ సాయిచైతన్యకు ఫిర్యాదు చేశారు. ఈసందర్భంగా బాధితురాలు మాట్లాడుతూ.. తమ ఇంటిని కూల్చివేస్తామని, పోలీసులకు ఇచ్చిన కేసును వాపసు తీసుకోవాలని వీడీసీ సభ్యులు భయభ్రాంతులకు గురి చేస్తున్నారన్నారు. అలాగే తమకు మద్దతుగా ఉన్న వారిని కూడా వీడీసీ ఇబ్బందులకు గురిచేస్తూనే, జరిమానా విధిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సీపీ స్పందించి వీడీసీపై చర్యలు తీసుకోవాలని కోరారు.

మూడు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

నవీపేట: మండలంలోని నాళేశ్వర్‌ వాగు నుంచి బుధవారం రాత్రి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఎస్సై వినయ్‌ గురువారం తెలిపారు. ఎలాంటి అనుమతులు లేకుండానే వాగు నుంచి ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్లను సీజ్‌ చేసి, రెవెన్యూ అధికారులకు అప్పగించామన్నారు.

ముగ్గురు వడ్డీ వ్యాపారులపై కేసులు

బిచ్కుంద(జుక్కల్‌): మండల కేంద్రంలోని వడ్డీ వ్యాపారుల ఇళ్లల్లో గురువారం పోలీసులు ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. భూములు, ఇతర పత్రాలు, ప్రామిసరినోట్స్‌ రాసుకొని రెట్టింపు వడ్డీ వసూలుకు పాల్పడుతున్నారని పక్కా సమాచారం రావడంతో ముగ్గురి ఇళ్లలో సోదాలు చేశామని సీఐ నరేష్‌ తెలిపారు. శ్రీరామ్‌ వీర్‌కుమార్‌, పడిగెల లక్ష్మణ్‌, ఎన్నెంవార్‌ అశోక్‌ ఇళ్లలో అధిక వడ్డీ కింద రాసుకున్న పత్రాలు లభ్యం అయ్యాయన్నారు. దీంతో వారిపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. ఎస్సై మోహన్‌రెడ్డి, సిబ్బంది ఉన్నారు.

మట్కా ఆడుతున్న ఇద్దరి అరెస్టు

ఆర్మూర్‌టౌన్‌: పెర్కిట్‌లో మట్కా ఆడుతున్న ఇద్దరిని అరెస్ట్‌ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్‌హెచ్‌వో సత్యనారాయణగౌడ్‌ గురువారం తెలిపారు. విశ్వసనీయ సమాచారం రావడంతో మట్కా స్థావరంపై దాడి చేసి మట్కా ఆడుతున్న అగల్‌ దివిటి సత్యనారాయణ, దండవుల పెద్ద వెంకటి పట్టుకున్నామన్నారు. వారి వద్ద నుంచి రూ.పదివేల నగదు, రెండు సెల్‌ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

క్రైం కార్నర్‌


చికిత్స పొందుతూ ఒకరి మృతి



కొత్తరాములు మృతదేహం


ఖలీల్‌వాడి: ఇటీవల ఆత్మహత్యకు యత్నించిన ఓ వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. నాలుగో టౌన్‌ ఎస్సై శ్రీకాంత్‌ తెలిపిన వివరాలు ఇలా.. నగరంలోని వివేకానందనగర్‌కు చెందిన కొత్తరాములు(50) రైస్‌మిల్‌లో పని చేస్తూ జీవనం సాగించేవాడు. కొన్ని సంవత్సరాలుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. దీంతో జీవితంపై విరక్తి చెంది ఈనెల 24న అతడు కల్లులో గడ్డి మందు కలుపుకొని తాగి ఇంటికి వెళ్లాడు. ఇంట్లో వాంతులు చేసుకోగా కుటుంబసభ్యులు విషయం చెప్పడంతో వారు అతడిని చికిత్స నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. బుధవారం రాత్రి చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందాడు. మృతుడి భార్య లక్ష్మీ గురువారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

గుర్తుతెలియని వ్యక్తి..



బాల్కొండ: రోడ్డు ప్రమాదంలో ఇటీవల గాయపడిన గుర్తుతెలియని వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. బాల్కొండ మండలం బస్సాపూర్‌ శివారులోగల పాత జాతీయ రహదారి 44పై మంగళవారం గుర్తుతెలియని వ్యక్తి కాలినడకన వెళ్తుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. దీంతో అతడికి తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు చికిత్స నిమిత్తం నిజామాబాద్‌ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. గురువారం ఉదయం చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో మృతి చెందాడు. మృతదేహాన్ని మార్చురీలో ఉంచామని, మృతుడి వివరాలు ఇప్పటి వరకు తెలియరాలేవని బాల్కొండ ఎస్సై నరేశ్‌ తెలిపారు. ఎవరికైనా వివరాలు తెలిస్తే బాల్కొండ పోలీస్‌ స్టేషన్‌లో సంప్రదించాలన్నారు.

అధికారి వేధింపులు భరించలేక అంగన్‌వాడీ టీచర్‌ ఆత్మహత్యాయత్నం



చికిత్స పొందుతున్న సువర్ణ

నస్రుల్లాబాద్‌(బాన్సువాడ): మండలంలోని బొమ్మన్‌దేవ్‌పల్లి గ్రామానికి చెందిన అంగన్‌వాడీ టీచర్‌ సువర్ణ ఉన్నతాధికారి వేధింపులు భరించలేక గురువారం ఆత్మహత్యకు యత్నించింది. బాధితురాలు మాట్లాడుతూ.. సంబంధిత ఉన్నతాధికారి ఇంటి పనులు చేయిస్తూ ఆమెకు మామూళ్లు ఇవ్వకపోతే తప్పులు తీస్తూ వేధిస్తుండడంతో ఫినాయిల్‌ తాగి ఆత్మహత్యకు యత్నించినట్లు తెలిపారు. స్థానికులు గమనించి ఆమెను సమీప ఆస్పత్రికి తరలిచంచారు. ప్రస్తుతం బాధితురాలు ఆస్పత్రిలో చికిత్స పొందుతుంది.

కంకర లారీ బోల్తా

రుద్రూర్‌: పోతంగల్‌ మండలం హంగర్గా ఆబాదిలో గురువారం కంకర లారీ బోల్తా పడింది. సీసీ పనుల కోసం కంకర లోడ్‌తో వచ్చిన లారీ ఖాళీ చేసేందుకు రివర్స్‌ తీసుకునే క్రమంలో బోల్తా పడినట్లు స్థానికులు తెలిపారు. ఈ ఘటనలో ఎవరికి ప్రమాదం జరగలేదని వారు పేర్కొన్నారు.

ఒడ్డెటమ్మ ఆలయంలో చోరీ

మాక్లూర్‌: మండలంలోని ఒడ్డెటమ్మ ఆలయంలో గుర్తుతెలియని దుండగులు చోరీకి పాల్పడినట్లు ఆలయకమిటీ చైర్మన్‌ మీసాల రవి గురువారం తెలిపారు. ఆలయంలోకి బుధవారం రాత్రి దుండుగులు చొరబడి హుండీని పగలగొట్టి అందులో ఉన్న సుమారు రూ.10వేలను అపహరించినట్లు తెలిపారు. చోరీ దృశ్యాలు సీసీ కెమెరాలో రికార్డయ్యాయి. ఈమేరకు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు రవి తెలిపారు.

అధిక వడ్డీ ఆశ చూపి రూ.కోటి టోకరా

ఖలీల్‌వాడి: నగరంలోని పూసలగల్లీకి చెందిన ఓ బీజేపీ నాయకురాలు పలువురికి అధిక వడ్డీ ఆశ చూపి రూ. కోటి టోకరా వేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బంధువులు, ఇతరుల వద్ద అధిక వడ్డీ ఆశ చూపి సదరు నాయకురాలు డబ్బులు తీసుకున్నట్లు బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. అయినా వారు పట్టించుకోకపోవడంతో బాధితులు అర్బన్‌ ఎమ్మెల్యే, ఆ పార్టీ జిల్లా అధ్యక్షుల దృష్టికి తీసుకువెళ్లినట్లు తెలిసింది. ఈ విషయమై ఎస్‌హెచ్‌వో రఘుపతిని వివరణ కోరగా బీజేపీ మహిళ నేతపై ఫిర్యాదు అందిందని, విచారణ చేపట్టినట్లు తెలిపారు.

డ్రంకెన్‌డ్రైవ్‌ కేసులో ఒకరికి రెండు రోజుల జైలు శిక్ష

నందిపేట్‌ (ఆర్మూర్‌): నందిపేట్‌లోని వివేకానంద చౌరస్తా వద్ద ఇటీవల పోలీసులు వాహన తనిఖీలు నిర్వహించగా పిట్ల గణేష్‌ అనే వ్యక్తి మద్యం తాగి వాహనం నడుపుతూ పట్టుబడ్డాడు. దీంతో అతడిని పోలీసులు గురువారం ఆర్మూర్‌ సెకండ్‌ క్లాస్‌ మెజిస్ట్రేట్‌లో హాజరుపర్చారు. అనంతరం జడ్జి అతడికి రెండు రోజుల జైలు శిక్ష విధించినట్లు ఎస్సై చిరంజీవి తెలిపారు.

ఇందల్వాయి మండలంలో..

ఇందల్వాయి: మండలంలోని గన్నారం గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ఇటీవల మద్యం తాగి వాహనం నడుపుతుండగా పోలీసులకు పట్టుబడ్డాడు. దీంతో పోలీసులు గురువారం అతడిని సెకండ్‌క్లాస్‌ మెజిస్ట్రేట్‌ ఎదుట హాజరు పర్చారు. అనంతరం జడ్జి అతడికి మూడు రోజుల జైలు శిక్ష విధించినట్లు ఇందల్వాయి ఎస్సై మనోజ్‌కుమార్‌ తెలిపారు.